REVIEW ARTICLE

INDIAN JOURNAL OF
MULTILINGUAL RESEARCH AND DEVELOPMENT

DOI: 10.34256/ijmrd2139

# A Comparative study of Andra bhasha bhushanam and Tolkappiyam

## ఆంధ్ర భాషాభూషణం - తొల్కాప్పియం : తులనాత్మక పరిశీలన

**Ch. Savithri** [a,*]

[a] School of Indian Languages and Comparative Literature, Tamil university, Thanjavur - 613010, Tamil Nadu, India
*Corresponding author Email: savithritamiluniversity@gmail.com
DOI: https://doi.org/10.34256/ijmrd2139
Received 12-08-2021; Revised 28-08-2021; Accepted 01-09-2021; Published 02-09-2021

**Abstract:** This review examines the subject under five sub-headings: writing intent, writing structure, Type of techniques, vocabulary, and spelling observation. Of these, the structure of the text is examined under two sub-headings, external structure and internal structure. Among the 32 writing techniques mentioned by Tolkappiyar, 1. Writing purpose, 2. Section order, 3. Codification expression, 4. Section expression, 5. Semantic coordination, 6. Fictional gestures, 7. Meaningful reference, 8. Alternative formula entry, 9. Future reference, 10. Sutra and examples are examined in bilingual grammars. In formulaic construction methods such as sutrartham, sutra structure, relation between sutras, gana, nipatam are taken into consideration. In the alphabet section, topics such as distribution of letters, creation of letters, conjugation, and word usage are examined. Finally, at the end of the character the 10 things identified in the bilingual grammars examined comparatively are revealed and the table of reference is compiled.

**Keywords:** Fictional gesture, Gana, Nipaata, Codification expression, Conjucation.

**Subject Specialization:** Telugu

---

### పరిచయం

ద్రావిడ భాషల్లో తమిళం, తెలుగు, మలయాళం, కన్నడానికి మాత్రమే సంప్రదాయ వ్యాకరణాలు వెలువడ్డాయి. తమిళంలో తొల్కాప్పియం, తెలుగులో ఆంధ్ర శబ్ద చింతామణి, మలయాళంలో లీలాతిలకం, కన్నడంలో కవిరాజమార్గం ఆ యా భాషల్లో వెలువడ్డ తొలి వ్యాకరణ గ్రంథాలు. వీటిలో తొల్కాప్పియం క్రీస్తు పూర్వం రాయబడ్డది అని తమిళ భాషా శాస్త్రజ్ఞుల అభిప్రాయం. తక్కినవి క్రమంగా క్రీ.శ.11, 14, 9 శతాబ్దాలు. ఈ నాలుగు గ్రంథాల్లో తమిళానికి మాత్రమే తమిళ భాషలో వ్యాకరణం రాయబడింది. తక్కిన మూడు భాషా వ్యాకరణాలు సంస్కృతంలో రాయబడ్డాయి. ఇవన్ని తమిళ భాషలో అనువాద రూపాలుగ దొరుకుతున్నాయి. అయితే తమిళ భాషకు తమిళ భాషలోనే రాయబడ్డ తొల్కాప్పియం లాగ తెలుగు భాషకు తెలుగులోనే రాయబడ్డ వ్యాకరణం ఆంధ్ర భాషా భూషణం. మూలఘుటిక కేతనచే 13వ శతాబ్దంలో రచింపబడింది. కాబట్టి ఆయా భాషలకు ఆయా భాషల్లోనే రాయబడ్డ తొల్కాప్పియం, ఆంధ్ర భాషా భూషణాలు ప్రస్తుతం తులనాత్మక పరిశీలనకు ప్రధాన ఆకరాలుగా తీసుకోబడ్డాయి. ఈ రెండు గ్రంథాల కాలాలు వేరయినప్పటికి విషయ పరంగా వ్యాకరణ కర్తలు చర్చించినవి సమానంగానే ఉన్నాయనే ఊహ్ ప్రతిపాదనతో పరిశీలించబడింది. ఈ ద్విభాషా లక్షణ గ్రంథాల్ని తులనాత్మకంగా పరిశీలించడానికి ఈ క్రింది అంశాల్ని ఎన్నుకోవడం జరిగాయి. అవి :-

1. రచనా ఉద్దేశం

2. గ్రంథ నిర్మాణం
3. సాంకేతిక పద్ధతులు
4. పదజాలం
5. అక్షర విభాగ విషయ పరిశీలన

1. **రచనా ఉద్దేశం :**

తొల్కాప్పియ రచనా ఉద్దేశాన్ని తమిళ విమర్శకులు మూడు విధాలుగ చెప్తున్నారు. అవి :-

- తొల్కకాప్పియం తమిళ ప్రజలు తమిళ భాషను నేర్చుకోవడానికి రాయబడింది. (మీనాక్షి -1982)
- సంస్కృత భాష తమిళదేశంలో వ్యాపించిన తొలి దశలో తమిళ భాషా ప్రత్యేకతల్ని అందరికి వివరించడానికి తమిళ వ్యాకరణ గ్రంథం ఒకటి అవసరమైన సందర్భంలో తొల్కాప్పియం రాయబడింది (క. వెళ్ళైవారణన్ : 1957)

తమిళ సాహిత్య సంప్రదాయాల్ని సంస్కృత సాహిత్య పరిచయమున్న ఒకరికి తెలియ జేయడం. అంటే అలాంటి వారు తమిళంలో రాయగలిగినప్పుడు తెలుసుకోవలసిన తమిళ భాషా సంప్రదాయాల్ని ఎరుక పరిచే విధంగా తొల్కాప్పియం రాయబడ్డది. ఈ పుస్తక పాఠకులు సంస్కృతం తెలిసిన వారుగా ఉంటారు (కా.శివతంబి - 1998).

పై ముగ్గురి అభిప్రాయాలను పరిశీలిస్తే బహుభాషా ప్రయోగ వాతావరణంలో సంస్కృత భాషా ప్రభావం ఉన్న కాలంలో మాతృభాషను దక్కించుకోవాలనే అభిమతాన్ని వెలిబుచ్చే ఉద్దేశంతో తొల్కాప్పియం రచించి ఉండవచ్చని చెప్పవచ్చు.

ఆంధ్ర భాషా భూషణ రచనా ఉద్దేశాన్ని కేతన 6.7.8. పద్యాల్లో క్రింది విధంగా చెప్పాడు.

క. మున్ను తెను(గునకు లక్షణ
మెన్నడు నెవ్వరును జెప్పరే ( జెప్పెద వి
ద్వన్నికరము మది మెచ్చ( గ
నన్నయ భట్టాది కవిజనంబు కరుణన్ (పద్యం - 6)

తే. సంస్కృత ప్రాకృతాది లక్షణము ( జెప్పి
తెను(గునకు లక్షణము (జెప్పకునికి యెల్ల(
గవి జనంబుల నేరముగాదు నన్ను
ధన్యుని (గావింప( దలచిన తల(పు గాని (పద్యం-7)

ఇంతకు మునుపు ఎవ్వరును తెలుగునకు లక్షణం చెప్పలేదని, క్రొత్తగ నేను చెప్పుతున్నానని కేతన అంటున్నాడు. తెలుగు భాషకు తెలుగులో ఎవ్వరు లక్షణం చెప్పనందువలన కేతన చెప్పాడు. అంతేకాకుండా పద్యరూపంలో వ్యాకరణం రచించిన వారిలో అగ్రగణ్యుడు కేతనే. పైగ నన్నయ వ్యాకరణం సంస్కృతంలో ఉన్నందున అందరికి అర్థంకాదని అందుకే తాను తెలుగులో రాయడానికి పూనుకున్నానని అన్నాడు.

కొందరు చింతామణిలో తత్సమ పద విషయ వ్యాకరణం ఎక్కువ ఉందని, కేతన గ్రంథంలో తత్సమేతర పద విషయ వ్యాకరణం ఎక్కువ ఉందని ఆ కారణం చేత తెలుగు భాషకు ముందెవ్వరు వ్యాకరణం చెప్పలేదని కేతన చెప్పినట్లు కొన్ని కల్పనలు కల్పింతురు (ఆ.భా.భూ. పీఠిక -12)

2. **గ్రంథ నిర్మాణం :**

తొల్కాప్పియర్ గ్రంథ ప్రారంభంలో 'చిరప్పుప్పాయిరం' అనే పేరుతో పదిహేను పాదాలలో ఒక పద్యం రాసారు. అది -

"వడవెంకటమ్ తెన్ కుమరి

ఆ ఇడైత్
తమిళ్ కూరుమ్ నల్ ఉలగత్తు
వళక్కుమ్ చెయ్యులుమ్ ఆ ఇరు ముదలిన్
ఎళుత్తుమ్ చొల్లుమ్ పొరులుమ్ నాడిచ్
చెన్ తమిళ్ ఇయర్కై శివణియ నిలత్తొడు
మున్దు నూల్ కణ్డు ముర్రైప్పడ ఎణ్ణిప్
పులమ్ తొగుత్తోనే పోక్కరుబనువల్
నిలమ్ తరు తిరువిల్ పాండియన్ అవైయత్తు
అరమ్ కరై నావిల్ నాన్ మరై ముట్రియ
అదంకోట్టు ఆసర్కు అదిల్ దప త్తెరిన్దు
మయంగా మరబిన్ ఎళుత్తు ముర్రై కాట్టి
మల్కు నీర్ వరైప్పిన్ ఐందిరం నిరైన్ద
తొల్కాప్పియన్ ఎనత్ తన్పెయర్ తోడ్రిప్
పల్ పుగళ్ నిరుత్త పడిమై యోనే

అని పై పద్యంలో ఉత్తరాద్రి నుండి దక్షిణాన కన్యాకుమారి వరకు నడుమ ఉన్న సరిహద్దు ప్రాంతాల్లో నివసించు తమిళ ప్రజల వాడుకలో ఉన్న వ్యావహారిక భాషను, కావ్యభాషను బాగా ఆకలింపు చేసుకొని, ఇంతకు మునుపు వచ్చిన గ్రంథాల్ని చదివి క్రమంగా నా తెలివి తేటల్తో అక్షర, పద, అర్థ విభాగాలతో ఈ లక్షణ గ్రంథాన్ని కూర్చాను. ఏ కాలానికి కూడా నిలబడ గలిగే ఈ లక్షణ గ్రంథాన్ని తిరువిల్ పాండియన్ సభలో ధర్మాన్ని బోధించి ప్రజలను సన్మార్గంలో నడిపింప జేసే వాక్కు కలవాడును, చతుర్వేదాల్ని చదివి జ్ఞానాన్ని పొందినవాడును అయిన అదంకోట్టు ఆసాన్ అనే పండితుని సమక్షంలో ఇసుమంతయు జంకు లేకుండా, తన గ్రంథంలో ఎటువంటి దోషము లేదని వక్కానించి, ఒక గ్రంథం రాయడానికి తగిన రచనా విధానాల్ని తెలిపి, సముద్ర పరిసర ప్రాంతాల్లో బోధనా జ్ఞానుడైన 'తొల్కాప్పియన్' అనే తన సహజ నామాన్నే గ్రంథ నామంగా ఉండేటట్లు చేసి, పలు రంగాల్లో విశిష్టతల్ని పొందిన శ్రేష్ఠున్ని అని తొల్కాప్పియరు తనను గురించి చెప్పుకున్నాడు.

ఆంధ్ర భాషా భూషణంలో కేతన, తొల్కాప్పియం పాయిరంలో లాగా చెప్పక పోయినా గ్రంథ ఆరంభంలోనే అంటే ఒకటి నుండి పదమూడు పద్యాల్లో తన గురించిన విషయాల్ని చెప్పుకున్నాడు. వాటిని -

- దైవప్రార్థన
- పుట్టుక
- రచనా ఉద్దేశం
- వేడ్కోలు

అనే అంశాలుగ వింగడించవచ్చు.

ఏ భాషా లక్షణ గ్రంథానైన నిర్మాణాన్ని బట్టి రెండు విధాలుగ పరిశీలించ వచ్చు. అవి -

- బాహ్య స్వరూపం (surface structure)
- అంత: స్వరూపం (Deep structure)

వీటిలో బాహ్య స్వరూపం అనేది కంటికి కనబడే రూపం. అంత: స్వరూపం అనేది విషయ సంబంధి. ఈ రెండు లక్షణాల్ని రెండు గ్రంథాల్లోను చూడవచ్చు. వాటి వివరణ -

**బాహ్య స్వరూపం :**

తొల్కాప్పియ వ్యాకరణ గ్రంథం పాయిరం అనే పీఠికతో ప్రారంభమై అక్షర, పద, అర్థమనే మూడు అధికారాల్లో, 27 పరిచ్ఛేధాలుగా, 1610 సూత్రాలతో వివరణాత్మకంగా రచింపబడింది. వాటి వివరాల్ని విపులంగా క్రింది పట్టికలో చూడవచ్చు.

### తొల్కాప్పియం

| సంఖ్య | అక్షర విభాగం | సూత్రాల సంఖ్య | పద విభాగం | సూత్రాల సంఖ్య | అర్థ విభాగం | సూత్రాల సంఖ్య | మొత్తం సూత్రాల సంఖ్య |
|---|---|---|---|---|---|---|---|
| 1. | సంజ్ఞా పరిచ్ఛేదం | 33 | పద పరిచ్ఛేదం | 81 | అంతర్గత జీవితం | 55 | 169 |
| 2. | పద సంప్రదాయం | 49 | విభక్తి పరిచ్ఛేదం | 22 | బాహ్య జీవితం | 36 | 107 |
| 3. | వర్ణోత్పత్తి స్థాన పరిచ్ఛేదం | 20 | విభక్తి ప్రత్యయ మార్పులు | 35 | ప్రేమ జీవితం | 50 | 105 |
| 4. | సంధి పరిచ్ఛేదం | 40 | సంబోధన విభక్తి | 37 | సంసారిక జీవితం | 53 | 130 |
| 5. | సంధి కూర్పు | 30 | నామవాచక పరిచ్ఛేదం | 43 | అర్థ పరిచ్ఛేదం | 54 | 127 |
| 6. | విభక్తి సంధి | 29 | క్రియా పరిచ్ఛేదం | 51 | రస సిద్ధాంత పరిచ్ఛేదం | 27 | 107 |
| 7. | అచ్సంధి | 93 | అవ్యయ పరిచ్ఛేదం | 48 | అలంకార పరిచ్ఛేదం | 37 | 178 |
| 8. | హల్సంధి | 110 | ధాతు పదాంశ పరిచ్ఛేదం | 98 | ఛందస్సు పరిచ్ఛేదం | 241 | 431 |
| 9. | కురుచ ఉకార సంధి | 78 | శేషపద పరిచ్ఛేదం | 67 | ప్రాణి సంప్రదాయ పరిచ్ఛేదం | 111 | 256 |
| 10 | మొత్తం | 482 | మొత్తం | 482 | మొత్తం | 664 | 1610 |

తొల్కాప్పియం అక్షర, పదవిభాగాల్లో చెప్పబడ్డ సూత్రాల సంఖ్య మొత్తం 964.

ఆంధ్ర భాషా భూషణంలో 192 పద్యాల్లో అక్షర పద విభాలకు సంబంధించిన వ్యాకరణమంతా చెప్పబడింది. వాటిలో -

| | | | |
|---|---|---|---|
| 1. | శార్దూలం | - | 1 |
| 2. | కందం | - | 136 |
| 3. | ఆటవెలది | - | 22 |
| 4. | తేటగీతి | - | 27 |
| 5. | ఉత్పలమాల | - | 1 |
| 6. | సీసం | - | 5 |
| | | | -------- |
| | మొత్తం | - | 192 |

తొల్కాప్పియంలో లాగా ఆంధ్ర భాషా భూషణంలో అధికార విభాగాలుగాని, పరిచ్ఛేద విభాగాలుగాని కనబడవు. కాకపోతే వ్యాకరణ విషయాల్ని చర్చించే ముందు కేతన చెప్పబోయే విషయాల్ని వచన రూపంలో తెలియ చేసాడు. అవి -

- అనంతరంబ సంస్కృత పదంబులు తెనుగు గావించు తెఱు గెఱిగించెద (పుట -8)
- అనంతరంబ సంధు లెఱిగించెద (పుట -12)
- అనంతరంబ విభక్తులు చెప్పెద (పుట -17)
- తత్సమ పదాంతంబులగు సప్త విభక్తులందు నేక వచన బహు వచనము లెట్టివనిన (పుట -22)
- అనంతరంబ సంబోధనంబు లెఱిగించెద (పుట -24)
- యుష్మదస్మత్పదంబు లెఱిగించెద (పుట -24)
- అనంతరంబ సమాసంబు లెఱిగించెద (పుట -25)
- అనంతరంబ క్రియా పదంబు లెఱిగించెద (పుట -31)

పైన పేర్కొన్న వచనాల్ని పరిచ్ఛేధాలుగ కనుక తీసుకొన్నట్లైతే సంజ్ఞలకు చెప్పక పోయిన, దానికి సంబంధించిన విషయాలు మొదట చెప్పినందువలన క్రమంగా

- సంజ్ఞా పరిచ్ఛేధం
- తత్సమ పరిచ్ఛేధం
- సంధి పరిచ్ఛేధం
- విభక్తి పరిచ్ఛేధం
- సంఖ్యావాచక పరిచ్ఛేధం
- సంబోధనా విభక్తి పరిచ్ఛేధం
- సర్వనామ పరిచ్ఛేధం
- సమాస పరిచ్ఛేధం
- క్రియా పరిచ్ఛేధం

అని ఆంధ్ర భాషా భూషణ వ్యాకరణ అంశాలు తొమ్మిది పరిచ్ఛేధాలుగ చెప్పుకోవచ్చు. ఈ పరిచ్ఛేధ అంశాల్ని తొల్కాప్పియంతో పోల్చిచూస్తే, తొల్కాప్పియంలోని అర్థ విభాగాన్ని తప్పించి, అక్షర మరియు పద విభాగాల్ని మాత్రం తీసుకొని ఆంధ్ర భాషా భూషణంతో పోలిస్తే తెలియ వచ్చే విషయాలు -

- తొల్కాప్పియం అనుసరించిన అధికార విభాగాలు గాని, పరిచ్ఛేద విభాగాలు గాని ఆంధ్ర భాషా భూషణంలో లేవు.
- ఆంధ్ర భాషా భూషణం 183 పద్యాల్లో చెప్పిన అక్షర, పద వ్యాకరణ అంశాల్ని తొల్కాప్పియం 964 పద్యాల్లో వివరించింది.
- ఆంధ్ర భాషా భూషణం తెలుగు సంస్కృత వృత్తాల్ని ప్రయోగించింది. తొల్కాప్పియం ఒకటి నుండి ముప్పై రెండు వరకు పద్య పాదాల్ని 'ఆచిరియర్ పా' అనే వృత్తంలో ప్రయోగించింది.
- అక్షర పద విభాగాల్లో చెప్పబడ్డ పద్యాలు ఒకటి నుండి పదమూడు పాదాల వరకు ఉన్నాయి.

ఉదాహరణకు -

"మూ అళబు ఇసైత్తల్ ఓర్ ఎళుత్తు ఇన్టే" (సూత్రం - 5)

"ఔగార ఇరువాయ్ప్

పన్నీర్ ఎళుత్తుమ్ ఉయిర్ ఎన మొళిబ" (సూత్రం - 8)

"నెడియదన్ మున్నార్ ఒట్టుమెయ్ కెడుదలుమ్

కురియదన్ మున్నార్ర్త తన్నురు ఇరట్టలుమ్

అరియత్ తోన్టుమ్ నెరియియల్ ఎన్ప" (సూత్రం - 160)

**3. రచనా సాంకేతిక పద్ధతులు :**

ఏ భాషలోనైన వ్యాకరణ గ్రంథాల్ని రాసేటప్పుడు కొన్ని సాంకేతిక పద్ధతుల్ని చేపట్టి గ్రంథరచన చేయడం జరుగుతుంది. దీనిని తమిళంలో 'ఉత్తి' అని అంటారు.

ఈ ఉత్తి అనేది చెప్పబోయే విషయం ఇదియని తెలుసుకోవడానికి, గ్రంథ విషయాల్ని విభాగ క్రమంగా కూర్చడానికి, విషయాల్ని సేకరించి చెప్పడానికి, సేకరించిన విషయాల్ని వివరణాత్మకంగా చెప్పి దాని వలన ఒక ప్రయోజనం ఉందని తెలుసుకోవడానికి పనికి వస్తుంది. ఇవి సూత్ర కుదింపుకి అణువైంది. ఇవి గ్రంథ కర్తలకు, గ్రంథపాఠకులకు చాలా ప్రయోజనకారిగా ఉంటుంది.

తొల్కాప్పియంలో లక్షణ గ్రంథ రచనకు అవసరమైన సాంకేతిక పద్ధతుల్ని 32 రకాలుగ చెప్పబడ్డాయి. వీటిలో అక్షర పద విభాగాలకు చెందిన పద్ధతులు మొత్తం పది మాత్రమే చూపబడ్డాయి. అవి -

1. నుదలియదు అరిదల్ (రచనా ఉద్దేశం)
2. అదిగార వగై (విభాగ క్రమం)
3. తొగుత్తు క్కూరల్ (క్రోడీకరణ వ్యక్తము)
4. వగుత్తుక్కూరల్ (విభజన వ్యక్తము)
5. మొళిన్ద పొరులోడు ఒన్టవైత్తల్ (శబ్దార్థ సమన్వయము)
6. తాన్ కురియిడుదల్ (కల్పిత సంకేతాలు)
7. పొరుళ్ ఇడైయిడుదల్ (అర్థాంతర సూచన)
8. పిఱన్ కోట్ కూరల్ (పరార్థ సూత్ర ప్రవేశము)
9. ఎదిర్ పొరుళుణర్తల్ (భవితార్థ సూచన)
10. ఉడంబోడు పుణర్తల్ (సూత్రంలో ఉదాహరణ)

వీటిలో తమిళ తెలుగు వ్యాకరణ గ్రంథాలు అనుసరించిన సాంకేతిక పద్ధతుల్ని పరిశీలిద్దాం -

1. **నుదలియదు అరిదల్ (రచనా ఉద్దేశం)**

తొల్కాప్పియర్, కేతన ఇద్దరు కూడా ఈ పద్ధతిని అనుసరించారు. తొల్కాప్పియర్ రచనా ఉద్దేశాన్ని పీఠికలో చెప్పగా, కేతన ఆశ్వాస ప్రారంభంలో కొన్ని పద్యాల్లో రచనా ఉద్దేశాన్ని చెప్పుకున్నాడు.

2. **అదిగార వగై (విభాగ క్రమం)**

తొల్కాప్పియర్ ఎళుత్తు (అక్షర విభాగం), చొల్ (పద విభాగం), పొరుళ్ (అర్థ విభాగం) అనే మూడు భాగాల్ని అమర్చి, ఒక్కొక్క దానిని తొమ్మిదేసి పరిచ్ఛేదాలుగా వింగడించి అర్థ రీత్యా ఒకదాని తర్వాత ఒకటి సమన్వయంతో కూడిన విధంగా కూర్చారు. కాని, కేతన ఒకే ఆశ్వాసంలో గ్రంథ భాగానంతా కుదిర్చారు.

3. **తొగుత్తుక్కూరళ్ (క్రోడీకరణ వ్యక్తము)**

రెండు మూడు విషయాల్ని చేర్చి ఒకే సూత్రంలో చెప్పడం. ఈ పద్ధతి రెండు వ్యాకరణాల్లోను పాటించ బడింది. తొల్కాప్పియంలో చాలా సూత్రాలు ఈ పద్ధతిలోనే కూర్చబడ్డాయి.

ఉదాహరణకు -

ఉయిరుమ్ పుళ్ళియుమ్ ఇరుదియాగి
అళవుమ్ నిరైయుమ్ ఎణ్ణుమ్ చుట్టి
ఉళ ఎనప్పట్ట ఎల్లా చొల్లుమ్ తత్తమ్ కిళవి తమ్మగప్పట్ట
మున్నై వరూఉమ్ కాలమ్ తోన్రిన్
ఒత్త తెన్న ఏ ఎన్ చారియై (సూత్రం : 164)

అంటే కొలమాణ, తూనిక సంఖ్యా పదాదిలో అజంతమైనా, హలంతమైనా తక్కువ కొలతలో చెప్పేటప్పుడు `ఏ' ప్రత్యయం వస్తుంది.

ఉదా. ఒన్రేకాల్ (ఒకటింపావు)
ఇరణ్డేకాల్ (రెండున్నర)

కేతన కూడా ఈ పద్ధతిని అనుసరించారనడానికి -

క. ఆరు సమాసము లిరువది
యారంతము లారు సంధు లవ్యయములు పె
క్కారింటి సగము రీతులు
నారింటికి నొక్క డెక్కుడౌను విభక్తులు (పద్యం – 18)

ఈ పద్యంలో కేతన సమాసాలు, అంతాలు, సంధులు, అవ్యయాలు, విభక్తులు వీటి సంఖ్యను గురించి తెలిపారు. ఈ పద్యంలో ఐదు విధాలైన వ్యాకరణ అంశాల్ని ఒకచోట చేర్చి చెప్పడం వల్ల ఇది క్రోడీకరించి వ్యక్తపరచారని చెప్పవచ్చు.

4 . **వగుత్తుక్కూరళ్ (విభజన వ్యక్తము) :**

ఒక సూత్రంలో క్రోడీకరించి చెప్పిన విషయాల్ని ఇంకొక చోట విభజించి చెప్పడం జరుగుతుంది. తొల్కాప్పియంలోను, ఆంధ్ర భాషా భూషణంలోను ఈ పద్ధతి అనుసరించ బడింది.

మూన్రు తలైయిట్ట ముప్పదిట్రు ఎళుత్తిన్
ఇరణ్డు తలైయిట్ట ముతలాకు ఇరుప:తు
అరునాంగు ఈర్ట్రొడు నెరినిన్రు ఇయలుమ్
ఎల్లా మొళిక్కుమ్ ఇరుదియుమ్ ముదలుమ్
మెయ్యే ఉయిర్ ఎన్రు ఆయీర్ ఇయల (సూత్రం : 103)

అవట్రుల్

మెయ్ ఈరు ఎల్లామ్ పుళ్ళియోడు నిలైయల్ (సూత్రం : 104)

కుట్రియలుగరముమ్ అట్రు ఎన మొళిట (సూత్రం : 105)

ఉయిర్ మెయ్ ఈరం ఉయిరీట్రు ఇయర్రే (సూత్రం : 106)

కేతన కూడ ఈ పద్ధతిని అనుసరించారనడానికి -

తత్సమంబు నాగ దద్భవం బన నచ్చ
తెనుగు నాగ మరియు దేశ్య మనగ
గ్రామ్యభాష నాగ గ నైదు తెరగులు
వేరె వేరె వాని విస్తరింత (పద్యం – 19)

తత్సమ, తద్భవ, అచ్చ తెలుగు, దేశ్య, గ్రామ్యం అని తెలుగు పదాలు ఐదు రకాలని చెప్పారు. వీటిని విభజించి ఒక్కొక్క దానిని విడిగా వివరించారు.

తర్వాతి పద్యంలో పైన చెప్పిన విషయంలో ఒక దానిని మాత్రం విపులంగా చెప్పారు -

మును సంస్కృత పదములపై
దెనుగు విభక్తులు ఘటించి తేట పడగ జె
ప్పిన నది తత్సమ మన జను
వనము ధనము పురుశ్డబల వసుమతి యనగన్ (పద్యం – 20)

ఇలా తద్భవాలు, తత్సమాలు, అచ్చతెలుగు పదాలు, దేశ్యం, గ్రామ్యం వీటిని విడివిడిగా తర్వాతి పద్యాల్లో వివరించబడ్డాయి.

5. **మొళిన్ద పొరులోడు ఒన్రవైత్తల్ (శబ్దార్థ సమన్వయము) :**

సమస్య ఎదురైనప్పుడు ముందు చెప్పిన విషయాల్ని అర్థం చెడకుండ భావాన్ని అన్వయించి చెప్పడం

6 . **తాన్ కురియిడుదల్ (కల్పిత సంజ్ఞలు) :**

గ్రంథకర్త తన అభిప్రాయాల్ని తెలియ జేయడానికి తగిన పదాల్ని వ్యావహారికం నుంచో లేదా కావ్యభాష నుంచో తీసుకోకుండా తానే స్వయంగా పుట్టించడం.

వ్యాకరణ గ్రంథాల్లో సాధారణంగా పారిభాషిక పదాల్ని సంప్రదాయానుసారం పాటిస్తారు. కాని కొందరు సంప్రదాయానికి వ్యతిరేకంగ స్వయంగా సంజ్ఞల్ని కల్పించి ప్రయోగిస్తారు. ఈ పద్ధతి ద్విభాషా వ్యాకర్తలు కూడా అనుసరించారు.

తొల్కాప్పియంలో చాలావరకు కల్పిత సంజ్ఞలే. కొన్ని మాత్రం ఇతర భాషా పదాలు.

7. **కల్పిత సంజ్ఞలు :**

కిళవి, మొళి, చొల్ (పదం), మెయ్యీరు (హలంతం), ఉరుబు (ప్రత్యయం), మాదర్ (ప్రేమ), ఉయర్తిణై (మహద్వాచకం), అఃగ్రిణై (అమహద్వాచకం), వెమ్మై (ఇష్టపడడం), తువణ్డు (నీరసం), పాగుపాడు (విభజన)

**సంస్కృత పదాలు :**

గుణం (విశేషణం)

తలైమైగ్ *గుణచ్* చొల్లుమ్ తత్తమక్కుఉరియ
నిలైమైక్కు ఏర్ప నిగల్లుప ఎన్బ (సూత్రం :1576)

వైశిగన్ (వైశ్యుడు)

వైశిగన్ పెరుమే వాణిగ వాళ్కై (సూత్రం : 1578)

చూత్తిరం (సూత్రం)

చూత్తిరత్తు ఇయల్బు ఎన యాత్తనర్ పులవర్ (సూత్రం : 1600)

ఆంధ్ర భాషా భూషణంలో సంస్కృత భాషా పదాలు, కేతనచే సృష్టింప బడ్డవి రెండూ కూడా ఉన్నాయి.

**సంస్కృత భాషా పదాలు :**

అగ్రపదము, బహువచనము, భవిష్యత్తు, భూతకాలం, విభక్తి, సమాసం, విభక్తి పేర్లు : ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్థి, పంచమి, షష్టి, సప్తమి, సంబోధన, సమాస రకాల పేర్లు : పూర్వ పదార్థ ప్రధానం, ఉత్తర పదార్థ ప్రధానం, ఉభయ పదార్థ ప్రధానం, అన్య పదార్థ ప్రధానం

**కేతనచే సృష్టింప బడ్డవి :**

ఆదులు, అచ్చ తెనుగు, అడగు, అరబిందు, అఱ్ఱు, ఇఱ్ఱు, ఉఱ్ఱు, కఱ్ఱు, జడ్డ, నిడుపు, పెఱ అచ్చులు, పొడము, సున్న, తేలుచు, తోసిపుచ్చి, ఉడుగు (లోపము)

8. **పొరుళ్ ఇడైయిడుదల్ (అర్థాంతర సూచన) :**

ఒక విషయాన్ని స్పష్టంగా చెప్పేటప్పుడు మధ్యలో వేరు విషయాల్ని గురించి కూడా చెప్పడం

9. **పిరన్ కోట్ కూరల్ (పరార్థ సూత్ర ప్రవేశము):**

ఇతర గ్రంథకర్తల అభిప్రాయాల్ని తన గ్రంథంలో చెప్పడం. తొల్కాప్పియర్ చాలా సూత్రాల్లో చెప్పిన విషయాల్ని తనకు ముందున్న వారు చెప్పినది అని సూచించే అర్థంలో ముందు నూల్ కణ్ణు (పురాతన గ్రంథాల్ని చదివి), ఉణర్న్దోరే (భావించిన వారు), మొళిబ (చెప్పారు), ఉణరక్కూరిన్ (అర్థమగు రీత్యా చెప్పారు), ఎన్మనార్ (అన్నారు), ఎన్బ (అన్నారు), ఉణరుమారే (అర్థమగు రీత్యా), పులమైయోరే (పండితులారా), యాత్తన పులవర్ (చేశారు పండితులు), నునిత్తగు పులవర్ (గొప్ప పండితులు) వంటి పదాలు కనబడుతున్నాయి.

"ముందు నూల్
కణ్ణు ముఱైప్పడ ఎన్ని" (పీఠిక)
(పూర్వమున్న గ్రంథాల్ని పరిశీలించి క్రమ పద్ధతిలో కూర్చి)

"నీట్టమ్ వేణ్డిన్ అవ్వళ పుడైయ
కూట్టి ఎళూఉదల్ ఎన్మనార్ పులవర్" (సూత్రం : 6)

(ధీర్ఘంగా పలకాలంటే ఎంత దూరం పలకాలో అంత దూరం వరకు కావలసిన చివరి అక్షరాన్ని పొడిగించుకో వచ్చు అని పండితులు అంటున్నారు.

ఆంధ్ర భాషా భూషణంలో కేతన తనకు ముందరి వ్యాకర్తల మతాలను ఎక్కడ కూడా అనుసరించినట్లు లేదు. కాకపోతే

క. భాషావేదులు నను విని
యాషణ్ముఖ పాణినిలకు నగు నెనయని సం
తోషింప నాంధ్ర భాషా
భూషణమను శబ్ద శాస్త్రమున్ రచియింతున్ (పద్యం – 8)

అని చెప్పడం మూలాన కేతన తనకు ముందున్న వారి మతాల్ని ఎక్కడా కూడా ప్రయోగించ లేదని తెలుస్తుంది. కాకపోతే తెలుగు పద విభజనలో గ్రామ్య పదాల్ని ప్రజల వద్ద నుండి సేకరించేడనడానికి క్రింది పద్యం తార్కాణం –

ఆ. తత్సమంబు దక్క తక్కిన నాలుగు
నచ్చ తెనుగు లందు రఖిల జనులు
నందులోను గ్రామ్య మనగ నెవ్వరు నొప్ప
రొరుల దెగడు చోట నొప్పు నదియు (పద్యం – 27)

**10. ఉడంబోడు పుణర్తల్ (సూత్రంలో ఉదాహరణ)**

సూత్రాలలో విధిని చెప్పినప్పుడు అందులోనే ఉదాహరణలు కూడా ఇవ్వడం. ఈ పద్ధతి తొల్కాప్పియంలో లేదు. ఉదాహరణలు మాత్రమే సూచించే పద్ధతి కూడా కేతనలోనే కనబడుతుంది.

ఉదాహరణ :

క. పదము తుది యిత్వ ముత్వము
పదిలంబుగ బహువచనము పై నొందినచో
నది దెలియు(డు మణులు ఘ్రుణులు
సుదతులు సన్మతులు సఖులు సుకవు లనంగన్ (పద్యం – 78)

పై పద్యంలో సూత్రంతో పాటు ఉదాహరణలు కూడా ఇవ్వబడ్డాయి.

క. క్రొన్నెల క్రొమ్మెరు (గులు నా(
గ్రొన్నన క్రొక్కారు నా(గ( గ్రొత్తమ్ములు నా
నెన్నడుము నెమ్మొగము నా
నెన్నడ నెత్తావి యన(గ నెన్నుదు రన(గన్ (పద్యం – 124)

ఈ పద్యంలో ఉదాహరణలు మాత్రమే ఇవ్వబడ్డాయి.

## సూత్ర నిర్మాణ పద్ధతులు :

లక్షణ గ్రంథాలన్నింటిలోను సూత్ర నిర్మాణాన్ని పరిశీలిస్తే వ్యాకర్తలు క్రింది ఐదు పద్ధతుల్ని అనుసరించారని తెలియ వస్తుంది. వాటిని పట్టిలో చూప బడింది.

| సూత్ర నిర్మాణ పద్ధతులు | | | | |
|---|---|---|---|---|
| **సూత్ర విషయం** | **సూత్ర నిర్మాణం** | **సంబంధం** | **గణం** | **నిపాతం** |
| ఏక విషయం | విధి సూత్రం | పరిచ్ఛేద సంబంధం | నామ గణాలు | పరిచ్ఛేధ నిపాతం |
| రెండు విషయాలు | వివరణాత్మక సూత్రం | అధికార సంబంధం | క్రియా గణాలు | అధికార నిపాతం |
| రెంటికి పైగ | | | వ్యాకరణంశ గణాలు | |

1. సూత్ర విషయం :

లక్షణ గ్రంథాలు పెక్కింటిలోను కూర్చ బడ్డ సూత్రాల్ని పరిశీలిస్తే వాటిలో చర్చించబడ్డ విషయాలు ఒక లక్షణానికి లేదా రెండు లక్షణాలకు, లేదా అంతకంటే ఎక్కువ లక్షణాలకు సంబంధించి ఉంటాయి.

తొల్కాప్పియం, ఆంధ్ర భాషా భూషణంలో కూడా ఈ లక్షణాలు కనబడుతున్నాయి.

**ఒక లక్షణానికి సంబంధించింది :**

తొల్కాప్పియర్ ఒక సూత్రంలో ఒక లక్షణాన్ని చెప్పేటప్పుడు రెండు విషయాల్ని కలిపి చెప్పిన సూత్రం -

ఎళుత్తెనప్ పడుబ

అగర ముదల్ నగర ఇరువాయ్

ముప్ప దెన్బ

చార్ను వరల్ మరబిన్ మూన్దలంగడైయే ( సూత్రం : 1 )

ఇందులో అక్షరాల సంఖ్య గురించిన ఏక విషయం. అందులో ప్రధాన అక్షరాలతో బాటు అప్రధాన అంటే ఒకదాని మీద ఆధారపడే అక్షరాల్ని (కురుచ ఇకారం, కురుచ ఉకారం, మూడు చుక్కలు – ఃః )కూడా చెప్పారు.

కేతన కూడా ఈ పద్ధతిని అనుసరించాడనటానికి -

క. ఆదులు స్వరములు నచ్చులు

కాదు లొగిన్ వ్యంజనములు హల్లులు నన(గా

మేదిని నెల్లెడ (జెల్లును

కాదులు నైదైదు కూర్చ నగు వర్గంబుల్ (పద్యం – 16)

పై పద్యంలో అక్షరాల గురించి చెప్పి వాటితో పాటు హల్లుల విభజనగ వర్గాల్ని కూడ చెప్పారు.

**రెండు విషయాల్ని ఒకే సూత్రంలో చెప్పడం :**

వ్యాకరణ సూత్రాల్లో ఒకే సూత్రంలో రెండు లక్షణాల్ని చెప్పడం.

తొల్కాప్పియర్ -

ఉయర్ దిణై ఎన్మనార్ మక్కళ్ చుట్టే

అ:రిణై ఎన్మనార్ అవరల పిరవే

ఆయిరు తిణైయిన్ ఇచక్కు మన చొల్లే (సూత్రం : 484)

పై సూతంలో మహద్వాచకాలు, అమహద్వాచకాలు కుడా ఒకే సూత్రంలో చెప్పబడింది.

కేతన కూడా ఈ పద్ధతిని అనసరించారు.

తత్సమంబు దక్క తక్కిన నాలుగు

అచ్చ తెనుగ లందు రఖిల జనులు

నందులోను గ్రామ్య మనగ నెవ్వరు నొప్ప

రొరుల నెగడు చోట నొప్పు నదియు

పై పద్యంలో అచ్చతెలుగు అంటే ఏమిటో చెప్పి అందులో గ్రామ్యాన్ని వివరించారు.

**2. సూత్ర నిర్మాణ పద్ధతి :**

సూత్ర నిర్మాణాన్ని రెండు రకాలుగ చూడవచ్చు.

- విధి సూత్రం
- వివరణాత్మక సూత్రం

**విధి సూత్రం :**

తొల్కాప్పియమ్:

నీట వరుదల్ చెయ్యుళుళ్ ఉరిత్తే (సూత్రం : 208)

(మాత్రా చంధస్సులో ప్లుతమనేది ఉంటుంది)

నీట్టమ్ వేణ్డి అవ్వళపుడైయ

కూట్టి యెళూఉదల్ ఎన్మనార్ పులవర్ (సూత్రం : 6)

(దీర్ఘ కాలికంగా ఉచ్చరించాలంటే ధ్వనుల్ని ప్లుతంగా ఉచ్చరించాలి)

వ్యాకరణ గ్రంథాల్లోని నిర్వచనాలన్నీ ఈ తెగకు చెందినదిగ చెప్పవచ్చు.

ఆం. భా.భూ.

సంధి నిర్వచనం దీనికి ఉదాహరణగ చెప్పవచ్చు

క. మొదలి పదము తుది వర్ణనము

వదలక పై పదము మొదలి వర్ణముతోడం

గదియగ సంధులు నా దగు (పద్యం – 43)

**వివరణాత్మక సూత్రం :**

సూత్రంలోని విషయం విడమర్చి చెప్పడం

తొల్కాప్పియం :

మగర ఇరుది వేట్రుమై యాయిన్

తువరక్ కెట్టు వల్లెళుత్తు మిగుమే (సూత్రం : 310)

(మకారాంత పదాలు విభక్తి సంధిలో మకరం లోపించి, పరుషాలు ద్విత్వాలవుతాయి)

ఉదా. మరమ్ + పెట్టగం = మరప్పెట్టగం (చెక్కతో చేయబడిన పెట్టె)

ఆ.భా.భూ.

ఆ. ఏక పదము నడిమి యిత్వ మొక్కొకతరి

నచ్చ తెనుగులోన నడగు బొడము

గూర్మి తాల్మి యనగ గూరిమి తాలిమి

యనగ గృతుల జెల్లు చునికి చేసి (పద్యం - 65)

ఇందులో పద మద్య ఇకారం గురించి ఉదాహరణలతో వివరించబడింది.

**3. సంబంధం :**

సూత్రాల్ని కుదిర్చేటప్పుడు ఒక సూత్రం ముందు వెనుక సూత్రాలతో అర్థరీత్యా సంబంధం కలగడం.

తొల్కాప్పియం :

వేట్రుమై వళియ పెయర్పుణర్ నిలైయే (సూత్రం : 116)

(నామవాచకాలకు విభక్తి ప్రత్యయాలు చేరతాయి)

"అవట్రువళి మరుంగిన్ చారియైప్ పెరుమే (సూత్రం : 118)

రెండింటికి మధ్య పదపూర్తి (చారియై) అనేది వస్తుంది.

"అవట్రుళ్

ఇన్నిన్ ఇగరమ్ ఆవిన్ ఇఋది
మున్నర్క్ కెడుదల్ ఉరిత్తు మాగుమ్ (సూత్రం : 120)

అళవాగుమ్ మొళిముదల్ నిలై ఇయ ఉయిర్ మిచై
న:కాన్ ర:కాణాకియ నిలైత్తే (సూత్రం : 121)

ఆ.భా భూ.

19, 20, 21 -26, (19-26 ) తెలుగులోని పద విభజనను 19 అవ పద్యంలో చెప్పి వాటిలో ఐదు రకాల పదాల్ని ఉదాహరణలతో తర్వాతి సూత్రాల్లో వివరించడం వల్ల ఇది వివరణాత్మక సూత్ర నిర్మాణంగ చెప్పవచ్చు.

**4. గణాలు :**

తమిళంలో దీన్ని వాయ్ పాడు అని అంటారు. ఈ పద్ధతి తమిళంలో కంటే తెలుగు వ్యాకరణాల్లో ఎక్కువగ కనబడుతుంది. తొల్కాప్పియంలో దీనిని రెండు విధాలుగ చెప్పారు.

- పెయరచ్చ వాయ్ పాడు (నామ గణాలు)
- వినైయెచ్చ వాయ్ పాడు (క్రియా గణాలు)

నామవాచకాలకు సంబంధించిన అంటే నామవాచకాలు, వాటికి చేరే తద్ధిత ప్రత్యయాలు అన్నీ పెయరియల్ (నామవాచక పరిచ్ఛేదం)లో చెప్పబడ్డాయి.

వినైయియాల్ (క్రియా పరిచ్ఛేదం)లో అసమాపక క్రియాపదాలు, వాటికి చేరు కృతంతాలు చెప్పబడ్డాయి.

**అసమాపక క్రియలకు ఉదాహరణ :**

చెయ్ దు చెయ్ యదు చెయ్ బు చెయ్ దెన
చెయ్ యిర్ చెయ్యియ చెయిన్ చెయ్ చెయర్కు ఎన
అవ్వగై ఒన్బదుం వినై యెంజు కిళవి (సూత్రం : 713)

**కృదంతాలకు -**

పిన్ మున్ కాల్ కడై వళి ఇడత్తు ఎన్నుమ్
అన్న మరబిన్ కాలం కణ్ణియ
ఎన్న కిళవియుమ్ అవట్రియల్ పిరవే (సూత్రం : 714)

పడిత్తప్పిన్, వరుమున్, వన్దక్కాల్, వన్దక్కడై, వన్దవళి, వన్ద ఇడత్తు
కేతన కొన్ని గణాలను చెప్పారు. ఉదాహరణకు -

ఆ. ఇల్లు కల్లు ముల్లు పల్లు విల్లన నివి
బహువచనము లగుచు పరగు నెడల
నిండ్లు, కండ్లు, ముండ్లు విండ్లన జను
సుతగుణాభిరామ నూత్నదండి (పద్యం – 74)

**నిపాతం :**

నిపాత సూత్రాన్ని తమిళంలో 'పురనడైచ్ చూత్తిరం'అంటారు. ఈ పద్ధతిని తొల్కాప్పియర్ ఒక్కొక్క పరిచ్ఛేదం చివరిలోను, అధికారం చివరిలోను ఒకటి లేదా రెండు సూత్రాల్లో చెప్పారు.

**పరిచ్ఛేద నిపాతం :**

ఎల్లా ఎళుత్తుమ్ వెళిప్పడక్ కిళన్ద
చొల్లియ పళ్ళి ఎళుతరు వళియిన్
పిరప్పొడు వరువళి ఉరళ్చ్చి వారత్తు
అగత్తు ఎళువళి ఉప్పై అరిదప నాడి
అణబిర్ కోడల్ అన్దనర్ మఱైత్తే
అ:దు ఇవణ్ నువలాదు ఎళున్దు పురన్దు ఇసైక్కుమ్
మెయ్ దరి వళియిసై అళబు నువన్రిచినే (సూత్రం : 102)

**అధికార నిపాతం :**

అక్షర విభాగం చివర నిపాత సూత్రాలుగ రెండు సూత్రాలని తోల్కాప్పియర్ చెప్పియున్నారు -

ఉయిరుమ్ పుళ్ళియుమ్ ఇరుదియాగిక్
కురిప్పినుమ్ పణ్పినుమ్ ఇచైయినుమ్ తోన్రి
-----------------------------------------------
పునరియల్ నిలైయిడై ఉణరత్తోన్రా (సూత్రం : 482)

కిళంద అల్ల చేయ్యులుల్ తిరినవుమ్
---------------------------------------
నన్మది నాట్టత్తు ఎన్మనార్ పులవార్ (సూత్రం : 483)

అలాగే పద విభాగం చివర కూడా ఒక్క సూత్రం మాత్రం చెప్పబడింది.

చేయ్యుల్ మరున్గినుం వళక్కియల్ మరున్గినుమ్
--------------------------------------------------
చొల్ వరైందు అరియప్ పిరిత్తనర్ కాట్టల్ (సూత్రం : 946)

కేతన నిపాత సూత్రాలంటూ ఏది చెప్పినట్లుగ లేదు. కాకపోతే 189 – 191 వరకు గల పద్యాల్లో ప్రజల భాషకు లక్షణం చెప్పినట్లుగ, అందులో తప్పులు ఉంటే తీర్చండి, ఒప్పుల్ని అంగీకరించండి అన్నారే కాని, తొల్కాప్పియర్ చెప్పినట్లుగ చెప్పలేదు.

తెలుగునకు లక్షణము భువి
నలవడి క్రియ దండి చెప్ప నభిధానములో
పల జెప్పిన క్రియ లన్నియు
దెలియుడు సత్కవులు మేలు దేట పడంగన్ (పద్యం – 189)

5. **అక్షర భాగం :**

ద్వి భాషల్లోని అక్షరాలకు ఇరు వ్యాకర్తలు ఇచ్చిన లక్షణాలను బట్టి వాటిని

1. వర్ణవిభాగం
2. వర్ణోత్పత్తి
3. సంధి
4. పదప్రయోగం

అనే నాలుగు అంశాల్లో పరిశీలించి చూడవచ్చు. కాని ఇక్కడ తొల్కాప్పియం గ్రంథ విషయాల్ని మాత్రమే చెప్పడం జరిగింది. వాటి వివరణ -

## 1. వర్ణ భాగం :

వర్ణవిభాగం అనేది అక్షరాల తత్వాన్ని వివరించదగిన విభాగం. ఈ విభాగంలో అక్షర సంఖ్య, వర్ణమాల, నామం, అక్షర నిర్మాణం, మాత్రా, పోలి, పదపూర్తి వంటి ఉప భాగాలు ఉన్నాయి. వాటిని విడిగా పరిశీలించవచ్చు.

### 1.1 అక్షర సంఖ్య :

తొల్కాప్పియం తమిళ భాషా అక్షరాల్ని -

ఎళుత్తెన ప్పడుబ

అకర ముదల్ నకర ఇరువాయ్

ముప్ప దెన్బ

చార్న్ద వరల్ మరబిన్ మూన్రలంగడైయే (సూత్రం : 1)

అని తమిళ అక్షరాలు ఎన్ని అనే సంఖ్యను చెప్పాడు. అంటే అకారం మొదలు నకారం వరకు ఉన్నవి ముప్పై అక్షరాలు, తక్కినవి మూడు. మొత్తం ముప్పై మూడు అన్నమాట. ఈ పద్యంలో అక్షర సంఖ్య చెప్పబడిందే గాని, అక్షరాలు ఏవేవి అనే వివరణ లేదు. ప్రధాన అక్షరాలు అచ్చులు, హల్లులు. వీటిలో అచ్చులు పన్నెండు అని, హల్లులు పద్దెనిమిదని చెప్పబడింది. ఇందు అజ్వల్లుల సంఖ్య చెప్పబడింది కాని అవి ఏవేవి అనే వివరణ లేదు.

### 1.2. నామం :

వ్యాకర్తలు అక్షరాలన్నింటిని వింగడించి వాటికి పేర్లు పెట్టే పద్ధతి వ్యవహారంలో ఉండేది. తొల్కాప్పియర్ ప్రధాన అక్షరాలైన అజ్వల్లులకు సాధారణ పేర్లుగా కురిల్(హ్రస్వం), నెడిల్(దీర్ఘం), చుట్టు(త్రికం), వళ్ళినం(పరుషం), మెళ్ళినం (అనునాసికం), ఇడైయినం(అంతస్థం) మొదలైన వాటిని చెప్పాడు. తక్కిన వ్యాకర్తలు ఈయన్ని అనుసరించారు.

### 1.3. అక్షర నిర్మాణం :

ఏ భాషలోనైనా లిపి కాలానుగుణంగా మార్పు చెందేదే. అక్షర నిర్మాణాల్ని గురించి తొల్కాప్పియర్ మూడు సూత్రాల్లో చెప్పారు.

ఉట్ పెరు పుళ్ళి ఉరువా గుమ్మే (సూత్రం : 14)

(అక్షరం లోపల చుక్క కలిగి ఉంటుంది)

మెయ్యిన్ ఇయర్కై పుళ్ళియొడు నిలైయల్ (సూత్రం : 15)

(హల్లులు సహజంగా చుక్కతో కూడి ఉంటాయి)

ఎగర ఒగరత్తు ఇయర్కైయుం అట్రే (సూత్రం : 16)

(ఎకార ఒకారాలకు అట్లే)

### 1.4. మాత్రా :

అక్షర ఉచ్చారణకు పట్టు కాలానికి మాత్రా అంటాం. దీన్ని ప్రతియొక వ్యాకర్త కూడా తన లక్షణ గ్రంథాల్లో గుర్తిస్తున్నారు. తొల్కాప్పియర్ ఉయిర్ (అచ్చు), మెయ్ (హల్లు), ఉయిర్మెయ్ (అజ్వల్లు), అళపెడై (ప్లుతం), మగర కురుక్కం (కురుచ మకారం) మొదలైన వాటికి ఉచ్చారణ కాలాన్ని విడి విడిగా వివరించాడు. వర్ణ ఉచ్చారణ కాలానికి మాత్రా (సూత్రం : 7) అని అన్నాడు. ఈయన హల్లుకి అర్థ మాత్ర అని, అందులోను సగం మాత్రా కాలానికి ఉచ్చరించేది (1/4) కురుచ మకారం అని, అచ్చుల్లో హ్రస్వానికి ఒకటి, దీర్ఘానికి రెండు, ప్లుతానికి మూడు మాత్రలు అని వివరించాడు.

### 1.5. పోలి :

ఐ, ఔ అక్షరాల్ని పోలి అక్షరాలు అనడం తమిళ ప్రాచీన సంప్రదాయం. ఈ రెండు అక్షరాలు క్రమంగ అ+ఇ=ఐ అని, అ+ఉ+ఔ అని, అ+య్+ ఐ అని అంటారు (సూత్రం : 54, 55)

### 1.6. వర్ణ స్థానం :

పదాల్లో కొన్ని అక్షరాలు పదాదిలోను, కొన్ని పద మధ్యలోను, కొన్ని పదాంతంలోను వస్తాయి. వీటిలో ఏఏ అక్షరాలు ఏఏ చోట వస్తాయి అన్న విషయాన్ని వ్యాకర్తలు తెలిపారు. వారు చెప్పిన అక్షరాలు తప్పించి తక్కిన అక్షరాలు పదాదిలోనో, పద మధ్యలోనో వస్తే అవి అన్యభాషా పదాలని మనం తెలుసుకోవచ్చు.

తొల్కాప్పియర్ పదాదిలో పన్నెండు అచ్చులును (59), క త న ప మ హల్లులు అచ్చులతో చేరి పదాదిలో వస్తుందని (61) చకార హల్లు అ,ఐ,ఔ అనే మూడు అక్షరాలతో కలసి పదాదిలో వస్తుందని (62), వకార హల్లు ఉ ఊ ఒ ఓ నాలుగు అచ్చులకు తప్ప తక్కిన ఎనిమిది అచ్చులతో కలసి పదాదిని వస్తుందని (67), ఞ ణ న మ య ర ల వ ళ, ళ - పదకొండు హల్లులు పదాదిలో వస్తుందని (78), ఔ (70 ), ఎ (71 ), ఎ,ఒ (73 ), ఉ ఊ (74 ), చ ఉ (75 ), ప ఉ (76) న (79 ) ఞ (80 ), వ (81 ) అక్షరాలు ఏఏ అక్షరాలతో లేదా ఏఏ పదాల్లో వస్తుందో తెలిపారు.

### 1.7. పదపూర్తి (చారియై):

ఇన్నే వట్రే అత్తే అమ్మే

ఒన్నే ఆనే అక్కే ఇక్కే

అన్ ఎన్ కిళవి ఉళప్పడప్ పిరవుమ్

అన్న ఎన్న - చారియై మొళియే -తొల్-(119)

అనేవి తొల్కాప్పియర్ చెప్పిన పదస్పూర్తులు. ఇవన్ని తొల్కాప్పియర్ కాలానికి ముందరి కాలంలో వ్యవహారంలో ఉండేవి. ఈ పదస్పూర్తుల్ని తర్వాత వచ్చిన వ్యాకర్తల్లో కొందరు ఎక్కించి , కొందరు తగ్గించి ప్రయోగించారు.

## 2. వర్ణోత్పత్తి :

తమిళ వ్యాకరణాలు వర్ణాల పుట్టుక లేదా ఉచ్చారణా విధానాన్ని ఒక పరిచ్చేదంగానో లేదా కొన్ని సూత్రాలలోనో వివరిస్తాయి. తొల్కాప్పియర్ వర్ణాల పుట్టుకను తెలిపే పరిచ్చేదంగా 'పిరప్పియల్'అనే దాన్లో వర్ణాల ఉత్పత్తి స్థానం, అచ్చులు, హల్లులు, ఆధార అక్షరాలు వీటి ఉచ్చారణ స్థానాన్ని తెలిపారు. వీటిలో వర్ణాల పుట్టుకను మాత్రం చెప్పిన సూత్రం -

ఉన్ది ముదలా మున్దు వళిత్ తోన్రిత్

తలైయినుమ్ మిడట్రినుమ్ నిలైయా

పల్లుమ్ ఇదళుమ్ నావుమ్ మూక్కుమ్

అణ్ణముమ్ ఉళప్పడ ఎణ్మురై నిలైయన్

ఉరుప్పుట్రు అమైయ నెరిప్పడ నాడి ఎల్లా ఎళుత్తుమ్ చొల్లుమ్ కాలైప్

పిరప్పిన్ ఆక్కమ్ వేరువేరు ఇయల

తిరమ్ పడత్ తెరియుమ్ కాట్చి యాన (సూత్రం : 83)

అనేది తొల్కాప్పియర్ చెప్పిన వర్ణాల పుట్టుక స్థానం. వీటిలో తల, కంఠం, గుండె, పల్లు, పెదవి, నాలుక, మూర్ధన్యం మొదలైన ముఖ అవయవాలు వర్ణాల ఉచ్చారణకు తోడ్పడతాయని చెప్పారు. ఇది ఆధునిక భాషా శాస్త్రంలో చెప్పబడ్డ వర్ణోత్పత్తి స్థానాలకు సమానమైంది.

## ౩. సంధి :

సాధారణంగా ఏ భాషా వ్యాకరణమైన చాలా వివరణాత్మకంగా వివాదించబడేది సంధి. అక్షర భాగంలోనే సంధి విషయాలకు సంబంధించిన లక్షణాలు తెలుపబడుతుంది. తొల్కాప్పియరుకి సంధిని వివరించడానికి ఆరు పరిచ్ఛేదాలు కావలసి వచ్చింది. ఈయన సంధి లక్షణాలను సాధారణ సంధులు, ప్రత్యేక సంధులు అనే రెండు రకాల్లో ఇమిడ్చారు. ప్రత్యేక సంధి భాగంలో అచ్చు, హల్లు, కురుచ ఉకారం మొదలైన వాటి సంధి తత్వాన్ని చెప్పారు. వీటిని విడి విడి పరిచ్ఛేదాలుగ వింగడించి చెప్పడం వల్ల దీని ప్రత్యేకత ఏమిటో తెలియ వస్తుంది. సాధారణ సంధి భాగంలో పదాల ఆది, అంతం, హలంతం, కురుచ ఉకారాంతం, అజ్వలాంతం, సంధి స్థానం మరియు అక్షరాలు, పదాలు సంధియైన పద్ధతిని పేర్కొన్నాయి. దీనికి విడిగ పరిచ్ఛేదం అమర్చి వివరించడం ద్వారా దీని ప్రత్యేకత ఏమిటో తెలియ వస్తుంది. సాధారణ సంధి లక్షణ భాగంలో పదాల ఆది అంతాలు, హలంతాలు, అజ్వల్లాంత, అక్షర సంధి, పదసంధి, మూడు విధాలైన వికారాలు, విశేషణ పదాల సంధి, సంధిలో వచ్చే విభక్తి ప్రత్యయాలు, కు, కణ్ పరుషాక్షరాల ప్రత్యయాలు, అదు అనే దానిలోని అకారలోపం, విభక్తి ప్రత్యయాలు నామవాచకాలకు తర్వాత వచ్చే విధానం, నామవాచక రకాలు, విభక్తి ప్రత్యయాల్లో అర్థమార్పు, అనునాసికాల ఆగమం, పర పదం స్వత్వరూపంలో ఉండడం, పరుషాలు విభాషగ రావడం, మధ్యమ పురుష క్రియా పదాల చేరిక, మహద్వాచక నామ సంధి, ఇకారాంత, ఐకారాంత సంధి, హ్రస్వ దీర్ఘాలకు ముందు పొల్లక్షరాలు, కొలమాణం, తూనిక, సంఖ్యావాచకాల సంధి, అరై అనే పదంతో సంధి, కురై అనే పదంతో సంధి, యావర్, యాదు అనే పదాల్లో సంధి వంటివి వివరించ బడ్డాయి.

## References


Aravendan, R., (2013), Tholkappiyac chirappukkal, kavya publication, Chennai, India.

Siva tambi, K., (1998), tholkappiya ilakkiyak kotpaadugal, International Tamil Studies, Chennai, India.

Tamizhannal, (April 2008), Tholkappiyam commentary, Meenakshi book Society, Madurai, India.

Usha Devi Ainavolu, (December 2009), Andra Bhashaa Bhushanamu – Original Text with Transliteration, Meaning, Translation and Linguistic Intepretation, EMESCO Books, Vijayawada, India.



## Funding

No funding was received for conducting this study.

## Conflict of interest

The Author has no conflicts of interest to declare that they are relevant to the content of this article.



## About the License

© The author 2021. The text of this article is open access and licensed under a Creative Commons Attribution 4.0 International License



## Cite this Article

Ch. Savithri, A Comparative study of Andra bhasha bhushanam and Tolkappiyam, Indian Journal of Multilingual Research and Development, Vol 2, Iss 3 (2021) 76-92.
DOI: https://doi.org/10.34256/ijmrd2139